ఆఫీసునుంచి ఇంటి కొచ్చి బట్టలు మార్చుకుని పడకకుర్చీలోకి వాలి పోయాను. ముఖం కడుక్కోవటానికే బద్ధకంగా ఉంది. పైగా ఒకటే చలిగాలి. కప్పు కాఫీ గొంతులోకి జారిస్తే కాస్త ఉత్సాహం వస్తుందనుకున్నాను. నా వాలకం కనిపెట్టింది కాబోలు, పొగలు చిమ్ముతున్న కాఫీకప్పుతో వచ్చింది సుజాత. కాని, మామూలు చిరునవ్వు మరిచిపోయింది. ఎక్కడ పారేసుకొచ్చిందో అని క్షణం కలవరపడ్డాను. నేను మాత్రం నవ్వకుండా ఉండలేదు, కప్పు చేతికి తీసుకుంటూ.

కాఫీ చప్పరిస్తున్నా, సుజాత ముఖాన్నావరించిన దిగులును గురించే ఆలోచిస్తోంది మనసు. సాధారణమైన రుసరుసలైతే ఆ లక్షణాలె వేరు. మనిషి తీరే మరో విధంగా ఉంటుంది! పొద్దున్న ఆఫీసుకుపోతూ సుజాతకు ఎలాంటి ప్రామిస్సులూ గట్టా చెయ్యలేదు. సినిమా ప్రోగ్రామ్ ఉందనీ, మల్లెపూలు మూట కట్టుకొస్తాననీ, ఏ నైలెక్స్ చీరో తెచ్చి తన అందాన్ని సింగారిస్తాననీ వట్టైరా చేతకాని వాగ్దానాలు చేసి భార్యను మురిపించటం నా మనస్తత్వానికే విరుద్ధం! అలాంటి కోరికలతో సుజాతకూడా నన్ను విసిగించి వేపార్చదు. ఆర్థిక మాంద్యమంటే మాకు చిరకాలం నుంచి ఒంట బట్టిన జాడ్యం! దాన్ని వదిలించుకోవాలని నేను చేస్తున్న విశ్వప్రయత్నాలు చాలా వరకు విఫలమవుతూనే ఉన్నాయి. సుజాత పరిస్థితుల్ని తలుచుకుని బాధ వ్యక్తపరిచినప్పుడల్లా, నా కంటే చచ్చు రకాల్ని మచ్చుకు ఒక రిద్దర్ని గురించి చెప్పి తృప్తిపరచటం నేర్చుకున్నాను. నాకు జీవితంలో మిగిలింది అమూల్యమైన సుజాత చిరునవ్వు ఒక్కటే! అదీ కరవైతే. . .

'టెలిగ్రామ్!'

ఉలిక్కిపడ్డాను. సైకిల్ దిగి నా వంకే చూస్తూ నిలుచున్నాడు మెస్సెంజర్. గబగబ బయటకు నడిచాను.

'ఎస్. లక్ష్మిపతి మీరేనా?' మెస్సెంజర్ అడిగాడు.

'అవును' అన్నాను తల ఊపుతూ.

'సైన్ చెయ్యండి' అని కాగితం చేతి కిచ్చాడు. సంతకం చేసి, కవరు తీసుకుని వరండాలోకి వెళ్ళాను. చేతులు వణుకుతున్నాయి. ఇంత తెలుగు దేశంలో ఏ మూల ఏ చుట్టం "ఢాం" అన్నాడో అని గుండె గిలగిల లాడుతూంది. కవరు చించాను. నాలుగు లైన్లకు మించి లేవు, ఇంగ్లీషు మాటలు. రెండు సార్లు చదివాను. సారాంశం అర్థమైంది.

'సుజా!' సంతోషంతో కేక పెట్టాను. పరుగెత్తుతూ వచ్చింది సుజాత, దిగులుకు కంగారు తోడుచేసుకుని.

'టెలిగ్రామ్' అన్నాను చిటిక వేస్తూ.



# రేపటి తీర్పు

'అభిమన్యు'

‘పెళ్ళిగామా? !’ అంది సుజాత, కళ్ళు పెద్దవి చేసి.

‘సారాంశం మాత్రం చెపుతాను, విను. “మా పత్రిక ఇటీవల నిర్వహించిన కథల పోటీలో మీ కథకు మూడవ బహుమతి వచ్చిందని తెలియపరచటానికి ఆనందిస్తున్నాము. ఈ సందర్భంలో మిమ్మల్ని అభినందిస్తున్నాము. సంపాదకుడు.” ’

‘మీ. . .రు. . . కథ రాసి పంపారా?’ ఆశ్చర్యంగా అంది సుజాత.

‘యెస్!’ అన్నాను సంతోషాన్ని ‘య’ దగ్గర సాగదీస్తూ.

‘మీ కేం చేతనవును?’

‘అయింది!’

‘ఎంత డబ్బొస్తుంది?’

‘ఎంతైతేనేం? కథకు ప్రైజ్ వచ్చింది. అది చాలదూ?’

‘ఏం కథ రాశారూ?’

‘అవును. . . ఏం కథ రాశాను?’ సమాధానం చెప్పలేక నాలో నేనే గొణుక్కున్నాను. కొన్ని క్షణాల క్రితం ఆకాశాని కెగిరిన మనసు సుజాత ప్రశ్నతో పాతాళానికి క్రుంగిపోయింది. గుండెల్లో చెప్పలేని మంట. అవ్యక్తంగానే నా రెండు కళ్ళూ చెమ్మగిల్లాయి. సుడి గుండంలో సుళ్ళు తిరుగుతున్నట్లుగా ఉంది శరీరం.

‘ఏమిటి అలా అయిపోతున్నారు?’ నా కళ్ళలోకి దిగ్భ్రాంతిగా చూసింది సుజాత.

‘నాకే తెలియటం లేదు. నీ కేం చెప్పను?’

‘మీ సంతోషంలో సగమైనా పంచుకోలేదు నే వింకా. ఇంతలోనే మీ ముఖం వాడిపోయింది. మిమ్మల్ని బాధ పెట్టానా?’ దీనంగా అడిగింది సుజాత, ఏదో నేరం చేసినట్లుగా.

‘లేదు, సుజా, సరైన ప్రశ్న వేశావు. గురి చూసి కొట్టిన బాణంలా తగిలింది గుండెకు. ఆ బాగ కళ్ళలో వ్యక్తమైం దంతే.’

‘అంటే, నా ప్రశ్న మిమ్మల్ని దుఃఖ పెట్టినట్లేగా?’

‘కాదు, సుజా, భయంకరమైన వాస్తవాన్ని గుర్తుకు తెచ్చావు.’

‘మీ మాటలు నాకు అర్థం కావటం లేదు.’

‘నేను రచయితను కాదని నీకు తెలుసు. కానీ, కథ రాశాను. బహుమతి వస్తుందని అనుకోలేదు. అదీ వచ్చింది. సంతోషించే హక్కు మాత్రం లేదు నాకు. లేదు, సుజా!’

‘అసలు సంగతి చెప్పరు కదా? ఇప్పు డెందు కింత బాధపడుతున్నారు?’

‘కథలోని జీవితాన్ని గురించి! ఆ జీవితంలోని చీకటిని తలుచుకుని. అంత చీకటి నాకు ప్రైజ్ తెచ్చిందని. అల్పత్వం నాలో ప్రవేశించి, క్షణికానందానికి లోనైనానని. ఇంకా ఏం కారణాలు చెప్ప మంటావు?’

‘నాకు అర్థమయ్యే కారణం ఒక్కటి చెప్పండి, చాలు! మీ అవస్థ చూస్తుంటే నా కెందుకో భయంగా ఉంది.’ సుజాత కంఠంలో వేదన పెల్లుబికింది.

‘ఏడాదినుంచి నాలో నేను మథన పడుతున్నాను, సుజా! జరిగిన విషయం తలపుకి రాని క్షణం లేదు. మనసు శల్యమైపోతోంది. వివరాలు తెలియక పోయినా, విషయం టూకీగా నీకూ తెలుసు. డ్రాయర్ సొరుగుల అడుగున చిత్తు కాపీ ఉంది. ఓపిక ఉంటే చదువు. ముందుగా నీ కెందుకు చూపలేదో నీకే అర్థమవుతుంది.’

మాట్లాడకుండా లోపలికి వెళ్ళింది సుజాత. కథ చదువుతూందో, కుంపటి ముట్టిస్తూందోనన్న మీమాంస నన్ను వేధించలేదు. అసలు లోనికి పోవాలనే తలంపే దూరమైంది. ప్రతి ఘట్టం నా కో వధ్య శిల. నా ఆలోచనలన్నీ దాని చుట్టూ ముసురుకుంటున్నాయి. పరిష్కారం లేని సమస్యలు. విముక్తి లేని నరకం. బ్రతకటమే మహా నేరంగా పరిణమించిన పరిస్థితులు.

నెత్తురు చల్లబడుతూంది. సత్తువ సడలిపోతూంది. కణతలు కటకటలాడుతున్నాయి. నరాలు పెటపెట తెగిపోతున్న అనుభూతి.

ఉన్నపళాన కుర్చీలో మూర్ఛపోతే ఎంత బాగుండును!

ఆ మూర్ఛనుంచి తేరుకోకుండా ఉంటే ఎంతటి సుఖమో, అదెంతటి శాశ్వతమైందో ఊహించగలను నేను. కాని, సుజాత! మూడు పసి ప్రాణాలు!! నేను చావకూడదు. బంధాలు తగిలించుకుని, మమతల్ని పెంచుకున్నవాడు ఒక్కసారి చావటం పిరికితనం. చిత్రహింసే తగిన శిక్ష.

వెలుగు చూడలేక గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

• • •

షేక్స్పియర్ సృష్టించిన షైలాక్‌ను గురించి నా కంత తెలియదుగానీ, మా ఆఫీసులో ఇద్దరు యు. డీ. సి. లకు మాత్రం అభినవ షైలాక్‌లని విశేష ఖ్యాతి ఉంది. అందరిలాగా ఫస్టున జీతాలు తీసుకుంటారు సాధ్యమైనంత ముందుగా! ఆ రోజున వాళ్ళ ముఖాల్లో దోబూచులాడే ఆత్రత, ఆందోళన చూస్తే కొత్తవాళ్ళకి మతి చెడుతుంది. నాకు, నాతోటి వాళ్ళకు ఉద్యోగం బ్రతుకు తెరువు. జీతం ఒక్కరోజు లేటయితే ఉక్కిరిబిక్కిరి అవుతాయి మా ప్రాణాలు. కాని, సదరు షైలాకులు ఉద్యోగం చేస్తున్నది ఉపాధికోసం కాదు. ఉబుసు పోక కంటే వచ్చి అబద్ధం చెప్పినట్లు!


షైలాక్ ది ఫస్ట్ జన్మనామం పరబ్రహ్మం. రెండో వాడు ఆనందం. మా ఆఫీసు జనం వాళ్ళిద్దరినీ ఎక్కడా విడి విడిగా చూసిన దాఖలా లేదు. రెండు పేర్లూ జోడించి చక్కగా ‘బ్రహ్మానందాలు’ అని పిలవటమూ రివాజు! వాళ్ళ పేర్లు ఎంత నాజూగ్గా అతికిపోయినాయో, వ్యాపారంలో వాళ్ళ మనసులూ అంత మజాగా ముడేసుకున్నాయి.

బ్రహ్మానందాల వ్యాపారం రెండు పాయలుగా సాగుతుంటుంది. ఒకటి—చిట్ ఫండ్; రెండవది—మనీ లెండింగ్!

మా ఆఫీసు పేరున గవర్నమెంటు ప్రతి నెలా పాతికవేలన్నా ఖర్చు రాసుకుంటుంది. అందులో మా ఇండ్లకు చేరేది సగమో, ఇంకా తక్కువో! మా డైరెక్టర్ గారి దగ్గర నుంచి నైట్ వాచర్ వరకూ ఈ నిజాన్ని చెంపలేసుకుని ఒప్పుకుంటారు.

డైరెక్టర్ ఆఫీసులో అప్పటికి నా సర్వీస్ రెండేళ్ళు పూర్తి కాలేదు. పదేళ్ళ క్రితం మఫిషల్లో ఎల్. డి. గా చేరి, ఆరేళ్ళ తరవాత యు. డీ. గా ప్రమోషన్ మీద వచ్చిన సరుకు నన్న మాట!

వెనకా ముందూ ఎవ్వరూ లేరు నాకు, సుయ్యా గొయ్యా తప్ప! నేను స్కూలు ఫైనల్ పాసవగానే మా నాన్నకు సర్వీస్ కమీషన్ గుర్తొచ్చింది. చెవులు పట్టుకుని వెంటబెట్టుకు వెళ్ళి నా చేత పరీక్ష వ్రాయించాడు. నా తెలివి తేటలు ఎల్. డి. కావటానికి సరిపోయినాయి! ఫస్ట్ ప్రెఫరెన్స్ కమెర్షియల్ టాక్సెస్, సెకండ్ ప్రెఫరెన్స్ డిపార్ట్‌మెంట్, చివర రెవెన్యూ అని మా నాన్న వరిస్తే—నన్ను తరింప జేసింది ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్. మా నాన్న దృష్టిలో పరమ బేవార్సుది! సర్వీస్ కమీషన్ ఛైర్మన్, ఆయన కారు డ్రైవరూ మా నాన్న ఆగ్రహానికి బాగా గురయ్యారు. ఆయన అనుభవంలో ఉన్న నానా బూతులూ ఆ ఇద్దరు దుమ్మెత్తి పోసినట్లు గాక, అటూ ఇటూ పది తరాల వాళ్ళని ఘోరంగా శపించాయి! దేశంలో లంచగొండితనం మితిమీరిం దన్నాడు. తను ఆ డ్రైవర్ వెధవకు లంచమిచ్చినా, కోరిన



డిపార్ట్‌మెంట్స్‌లో పోస్టింగ్ ఇప్పించలేదని వాడి పుట్టుకనే అనుమానించాడు. తెలు
[illegible] శ్రీరాముడట. అందుకని ఆయన తల్లి శీలం మీదనే బురద చల్లాడు. తెలుగుజాతికే వన్నె తెచ్చి పెడుతున్న కులతత్వం, కుల దర్పం తనలోనూ వేళ్ళు తన్నుకుని ఉందని మా నాన్న మరిచిపోయి ఉంటాడు, పాపం!

ఉద్యోగంలో చేసిన ఆరు నెల్లకు నన్ను పూర్ణపురుషుణ్ణి చేశాడు నాన్న. పిల్ల మేలిమి బంగారం! అత్తమామలు సదాచార సంపన్నులు. మడి కట్టుకోనిదే మంచినీళ్ళు ముట్టరు. కట్నం రెండు వేలు రొఖ్ఖం. అమ్మాయి అందమైన పేరు భ్రమరాంబ! చదువుకుంటే వక్రమంగా కాపరం చెయ్యదనే భయంతో పతివ్రతల కథలమృతమే ప్రైవేటుగా చెప్పించారు. ఎబిసిడి లంటే భయపడ్డ క్కువ వాంతి చేసుకునే పండిత ప్రకాండుడో కాయన భ్రమరాంబ గురువు. అన్నింటికీ మించిన అర్హత—కొత్త కాపరంలో మరో ముసిల్దాని పీడ లేకుండా ఉడకేసి పెట్టగల సమర్థత! ఇక పెళ్ళి జరగటానికి అభ్యంతరా లేముంటాయి? కాకపోతే, కట్నం సొమ్ము చెల్లించటానికి రెండు గదుల పెంకుటిల్లు తాకట్టు పెట్టి తెచ్చారు మామగారు! ఆ సంగతి మా నాన్నకు తెలిసే ఉంటుంది. పెళ్ళయిన తరవాత భోజనాల పట్టులో కట్నాల సమస్య చర్చకు వచ్చింది.

'ఈ వరకట్న పిశాచం వల్ల మన లాంటి మధ్యతరగతి కుటుంబాలు అనేక విధాలుగా చితికిపోతున్నాయి' అన్నాడు అద్దె సగానికి కొరికి.

మిగతా బంధువులు మా నాన్న స్టేట్‌మెంట్‌ను ఏకగ్రీవంగా ఎండార్స్ చేశారు, కేవలం తలలు పంకించి. అంత రాత్మల ప్రబోధ ప్రమేయాలు లేవు, ఆచరణలో ఆహారం వదులుకోలేరుకాబట్టి.

వివాహ వైభవంలోనే పునః సమాగమ వేడుకా పూర్తయింది, ఎల్. డి. గా ఒంటరి మఠంలో బతికిన నేను, భ్రమరాంబతో అద్దె కొంప కాపరం ప్రారంభించాను. కొట్లో ఖాతా, పాల ఖాతా, చివరకు కూరల ముసలమ్మ దగ్గరా ఖాతా! ఖాతా జీవితమంటే మొదట్లో గొప్ప మోజుగా అనిపించింది. తరవాత తరవాత తెలిసింది, వాళ్ళందరికీ బాకీ పడుతున్నానని. అయినా, ఇద్దరం చెరిసగం సుఖం పంచుకుంటూ కాలానికి కళ్ళెం వెయ్యకుండా గడిపేశాం.

దరి[illegible] ఆకలే ఇదు, అద్దె న్నమూ ఎక్కువే మరి! పరవగా ఇద్దరికి ఇద్దరు చేరటం మా నాన్న దృష్టిలో మహాయోగం! ఖర్చులు పెరిగి కారాలు మిరియాలు నూరటం అలవాటైంది నాకు.

'కావాలంటే పుడతారా పిల్లలు? మీకంత కష్టంగా ఉంటే ఇంతటితో సరిపెట్టుకుందాం! గవర్నమెంటూ మెచ్చుకుంటుంది' అంది భ్రమరాంబ వినయంగానే. సరేనని మూడో కాన్పు తరవాత ప్లానింగ్ పాటించాం. ఎంత సర్దుకున్నా, నెల నెల బడ్జెట్‌ను రివైజ్ చేసినా, చేబదుళ్ళు లేకుండా నెల గడవటం గగనమైపోయింది.

మనిషిలో ఉన్న ఆరేళ్ళా చేబదుళ్ళ మెహర్బానీ మీద నెట్టుకొచ్చాను. డైరెక్టరేట్‌లో చేరిన రెండేళ్ళ దాకా అలవాటే నా సరుకు నిలిపింది! నా యోగం మారుతుందనో, నిజంగానే జీవనయాత్రలో అలిసిపోయో మా నాన్న అనాయాసంగా తనువు చాలించాడు. ఒకందుకు థాంక్స్ చెప్పుకున్నాను.

ఓ రోజు లంచ్ బ్రేక్‌లో కాంటీన్ వైపు వెళుతున్నా.

'ఆ టెక్కడికండీ?' అంటూ పలకరించాడు పరబ్రహ్మం నవ్వుతూ.

'కాంటీన్‌కు' అన్నాను నేనూ నవ్వి.

'ఆ పాడు కాంటీన్‌లో ఏముంటుందండీ, ఈగలు ముసురుతూ!' అన్నాడు ఆనందం రోతపడుతూ.

రెండేళ్ళనుంచి తెలియని కొత్త విషయం విస్పష్టమయింది నాకు. వెంటనే జవాబు తోచలేదు నాకు.

'అదుగో ద్వారక! రండి, వెళదాం!' మాటన్నా ముందే చెరోక చేయి పుచ్చుకున్నారు. మధ్యతరగతి మొహమాటం నా వెన్ను మీద తేళ్ళుగా చరిచింది. దర్జాగా వాళ్ళ మధ్య నడిచి వెళ్ళాను ద్వారకకు.

గులాబ్‌జాములకు ఆర్డ రిచ్చాడు పరబ్రహ్మం.


'ఆవుటాఫ్ డ్యూటీలో ఏం చేస్తుంటారు మీరు?' అడిగాడు ఆనందం, మంచినీళ్ళు తాగి.

'నా భార్య రోగిష్ఠిది! అవసరమైతే వంటచేస్తా. సిటీ అంతా గొడ్డుపోయి పట్నంగా ఓ మారుమూల పడిఉన్నాం. పంపు ల్లేవు. బావి నీళ్ళు తోడటం నా డెయిలీ డ్యూటీ. ఇంకా చిల్లర పనులు చాలా ఉంటాయి. సాహిత్యం పట్ల అభిరుచి ఉంది! చదవటానికి కుదిరేదవదు. ఏదో ఇలాగే ...' నిజం చెప్పే దురభ్యాసం నాది.

'కన్నకీవు లన్న మాట!' మూతి ముడిచి, తల ఎగరేస్తూ అన్నాడు పరబ్రహ్మం.

'అలా చెప్పుకోవటానికి నేను కించపడను. కాని, మా ఇరుగు పొరుగు ఆడంగులు నన్ను పనికిరాని మగాడు కాదని ప్రచారం చేస్తుంటారు. పూర్ ఫెలోస్!'

గులాబ్‌జాములు వచ్చాయి.



'ప్లీజ్, హెల్ప్' అని ఒక ప్లేటు నా ముందుకు జరిపాడు ఆనందం.

'[illegible], పిల్ల [illegible]?' పరబ్రహ్మం.

'ముగ్గురు.'

'ప్లస్ ఎంత, మైనస్ ఎంత?' ఆనందం.

ప్లస్ మైనస్‌ల పరిగణన ఆదాయ వ్యయాల గొడవని నాకు తెలుసు.

'ఒకబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు' అన్నాను వాళ్ళ కోడ్ మార్చి.

గులాబ్‌జాములు సగంలో ఉండగానే రవ్వ దోసెలకు ఆర్డరిచ్చాడు పరబ్రహ్మం. ఈ అనూహ్యమైన ఆదర ణేమిటా అని మనసులో అలజడిగానే ఉంది. అందులో ఇద్దరూ లబ్ధ ప్రతిష్ఠులు; అపర షైలాక్స్!

'ఏమన్నా కూడబెడుతున్నారా, అంతా కర్పూరమేనా?' ఉద్వృతంగా నవ్వుతూ అన్నాడు పరబ్రహ్మం.

'కూటికి చాలని రోజుల్లో కూడబెట్టే దేమిటి, అప్పులు తప్ప!' నిముగ్నా ఉంది నాకు.

'అసలు కూడే దొరకని రోజులు ఎంతో దూరంలో లేవు, గోపాలంగారూ! మన సోషలిజం అప్పుడు గాని సార్థకం గాదు.' నా నిముగుమ తన నిమురుతో విరగ్గొట్టాడు ఆనందం. షైలాక్ నోట్లో 'మన సోషలిజం' గాయపడటం వెగటుని పించింది. నాకు.

రవ్వ దోసెలు వచ్చాయి.

'ఇదో బోడి ఫేషన్!' నవ్వానూ, ఫోర్కు బల్లమీదనడేశాడు పరబ్రహ్మం.

మేమూ అలాగే చేశాం, మంచిదని అనుకుని.

'ఏ వేళా అయినా, మన జాగ్రత్తలో మనం ఉండాలి, గోపాలంగారూ! ముందు చూపు అవసరం.' టాపిక్ మార్చాడు ఆనందం.

'రాబోయే గడ్డు కాలాన్ని ఎదుర్కోవాలంటే గుండె ధైర్యం ఒక్కటే చాలదు. బాంక్ బాలన్స్ ముఖ్యం. అదే మనల్ని రక్షిస్తుంది!' పరమసత్యం చెప్పాడు పరబ్రహ్మం.

ఇండియాలో చాలా బాంకు లున్నాయి. లాభసాటి బాంకుల్ని సొంతం చేసుకుంది ప్రభుత్వం. కాని, ఒక్కదానిలోనూ సేవింగ్స్ అకౌంట్ తెరిచిన బుద్ధిమంతుణ్ణి కాదు నేను. చేబదుళ్ళు చేసుకోవటానికే టైమ్ దొరకదు నాకు.

'మూడు కాఫీయా, సార్?' బేరర్ అడిగాడు పోతూ పోతూ.

'ఊఁ' అన్నాడు ఆనందం.

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు, టైమ్ చూసుకుంటే రెండు.

'ఫరవాలేదులెండి. మ నా ఫీసేగా?' అన్నాడు పరబ్రహ్మం, నాలుక చప్పరించి వాళ్ళ కంటే స్పీడ్గా అంటే ఆఫీసులో. పని లేకపోయినా సీటుకు అతుక్కుని కూర్చోవటం నా కో జబ్బు!

'ఇకనుంచైనా మీరు సేవింగ్స్ మొదలెట్టాలి!'

'అదర్‌వైజ్, ఫ్యూచర్‌లో దెబ్బ తింటారు.'

'మనలాంటి ఉద్యోగులకు చిట్ ఫండ్ చాలా ఉపయోగం.'

'రెండు విధాల లాభదాయకం.'

'కమీషన్ వెరీ ఎట్రాక్టివ్!'

'సపోజ్, నెలకు ఏభై రూపాయలు ఇన్‌వెస్ట్ చేస్తారనుకోండి. ఏవరేజ్‌న మీరు వందకి మించి చెల్లించే పనుండదు. ఏభైకి పది రూపాయలు వడ్డీ ప్రపంచంలో ఏ బాంకి ఇస్తుంది చెప్పండి?'

'ఇవన్నీ మీకు తెలియవని కాదు, గోపాలంగారూ! కొద్దో గొప్పో మీ పరిస్థితుల్ని అర్థం చేసుకున్నాం కాబట్టి మంచి దారి చూపించాలని. అంతే!'

'తెలిసినా, కొందరు ఉపేక్షతో మంచి పని చెయ్యరు. అప్పుడైన వాళ్ళు అలాంటి వ్యక్తుల్ని మేలుకొలపటం ధర్మం!'

'వచ్చే నెలనుంచి న్యూ సీరీస్ ప్రారంభిస్తున్నాం. మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం, కనీసం ఏభై చిట్‌లో చేరండి. ఓన్లీ వన్ ఇయర్ పీరియడ్.'

'డబ్బు గారంటీ! మెంబర్స్‌లో మెజారిటీ మన ఆఫీసు వాళ్ళే! రిలయబుల్ అండ్ ప్రాఫిటబుల్.'

'మీ పేరు నోట్ చేసుకుంటాం మరి!'

'ఎలాగో మిగిలిన జీతంలో ఎడ్జెస్ట్ చేసుకోండి.'

'కష్టపడంది, కూడబెట్టలేం.'

'మన ట్రబుల్స్ మనల్ని ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటాయి!'

'ఇలా చనువు తీసుకున్నందుకు మీరేం అనుకోవద్దు.'

'మే మేదో స్వార్థంతో నిర్బంధిస్తున్నా మనుకుంటే మానెయ్యండి. మీ ఇష్టం.'

కాఫీ తాగేశాం. బిల్లు పరబ్రహ్మం లాక్కున్నాడు. నా కా ఊపన్నా రాలేదు కనీసం! విచిత్రమైన ముగ్ధత ఆవరించింది మనసును.

'ఓ కే అనలేదు మీరు' అన్నాడు పరబ్రహ్మం లేస్తూ.

'మౌనమే అంగీకారం.' మాటుగా నవ్వుతూ లేచాడు ఆనందం.

బ్రహ్మానందాల వెంట చంటిపిల్లాడిలా బయటికి నడిచాను.

ఆఫీసు జనంలో ఎంతమందికి బాంకు బాలన్సు లున్నాయో విచారించాలిగానీ, సగం నెలమంచే చేబదుళ్ళకు దేబిరిస్తూ పొదుపు చెయ్యటం సాధ్యమా అన్న ఇంగితం గానీ నా మనసులోకి వచ్చి ఉంటే కథ వేరుగా ఉండేదేమో!

మొదటి నెల ఏభై సంతోషంగా సమర్పించాను. వాళ్ళు చెప్పినదానికంటే రెండు రూపాయలు అదనంగానే వచ్చింది కమీషన్. పై నెల నుంచి ప్రారంభమైంది అసలు ప్రహసనం! అంతవరకూ పాతికా పరకా అప్పుచేసి నెల తిప్పేవాణ్ణి. ఇప్పుడు ఏభై దాటుతున్నా, నెలకు రోజులు ఎక్కువైనట్లుగా ఫీలవవలసి వస్తోంది.

ఉంటే రూపాయితో తీరే అవసరం, అప్పుచేస్తే ఆ అవసరం విలువ రెట్టింపవుతుంది!

పోను పోను నా ఆర్థిక స్థితి వికృత రూపం దాల్చింది. ఇంటి అద్దె, పచారి షాపులో, పాలు, కూరల బాకీ కాక ఇంకా కొన్ని చిల్లర మల్లర ముదువులు చెల్లించే సరికి జీతంలో పాతిక మిగిలాయి ఒక నెల! బ్రహ్మానందాల కంపెనీకి ఏభై, చేబదుళ్ల దెబ్బ గొంతుమీ దున్నాయి. ఎటూ పాలుపోలేదు నాకు. ఎవర్ని నోరు తెరిచి అడిగే అస్కారం లేదు. నెల మధ్యలో ముక్కెత్తపంపిన మనిషి, రెండో లేదీనే జోలె పట్టిందంటే ఎవరు ఊరుకుంటారు కూడా మొహోప్పే తిడతాడు. బదులిచ్చిన మిత్రులు చూపులతోనే చురకలు పెడుతున్నారు రోజూ! కంపెనీకి అయిదో తేదీ వరకూ గడువుంది. కానీ, డబ్బు పుట్టే మార్గం కనిపించదు! ఏమైనా వస్తువులు అమ్మేద్దామన్నా, పనికొచ్చే దొక్కటీ లేదు చెంబు, తప్పాలాలుతప్ప. పెళ్ళప్పుడు కొనుక్కున్న రిస్ట్ వాచీ, ఉంగరం, భ్రమరాంబ తాలూకు మంగళసూత్రం తాడు తొలినాడే హరించివాయి!

అప్పుడు లక్ష్మీపతి సలహా అడిగాను. ఇతరులు అసూయపడేంత గాఢ స్నేహముంది మాకు. అందుకు మా జాతకాలు ఒకటి కావటం కూడా కారణం కావచ్చు.

'ఆ పుణ్యమూ బ్రహ్మానందాలకే దక్కనీయ్' అన్నాడు పతి, కొరకొర లాడుతూ.

'ఎందుకురా అంతకోపం?' అన్నాను గుణుస్తూ.

'ఏ గ్రుడ్డిగి చిట్‌లో చేరావు నువ్వు? అప్పుడు నా సలహా అవసరం లేకపోయిందా?'



జీవన సమరం ఫొటో—ఆర్. ఉదయభాస్కరరావు (తిరుచ్చి)

'నువ్వూ మెంబర్‌వే కదరా!'

వచ్చాడేవన్న మాట!'

'మీరంతా ఉన్నారుగా తోడని, చేరాను!'

'చావటానికి తోడెందుకు? తోడూ నీడా సుఖంగా బతకటానికి!'

'నీ సలహా అడగని మాట నిజమే, పతి! వాళ్ళు నాకేపాటి అవకాశం ఇవ్వలేదు. గులాబ్‌జాములు, రవ్వ దోసె పెట్టించి ప్రలోభంలో ముంచేశారు. నువ్వన్నట్లు వలలో చిక్కాను. చిక్కులు ఎక్కువయి నాయి. అర్జెంటుగా నూట ఇరవై కావాలి. లేకపోతే పరువు పోతుంది!' ప్రాధేయపడ్డాను మిత్రుడి ముందు.

నిట్టూర్చాడు లక్ష్మీపతి.

నా కాళ్ళు చల్లబడినాయి!

'రక్తంతో దప్పిక తీర్చుకునే జలగలు వాళ్ళు. విషాన్ని పాలుగా భ్రమింపచేయగల మాంత్రికులు! వాళ్ళ అవసరం మనకు ఎప్పుడో గాని ఉండదు! కానీ, మన అవసరం వాళ్ళకి ఎప్పుడూ ఉంటుంది. అందుకే వాళ్ళు మనుషుల్ని వేటాడుతారు. మన దేశంలో గౌరవముంది వాళ్ళకి! రాజ్యాంగంలో రక్షణ కూడా ఉంది. అయినా, ఇప్పుడు వాళ్ళే నీకు దిక్కు' అన్నాడు పతి కోపాన్ని, జాలిని కలబోసి.

జీవితం వగుడాకులా గాలికి కొట్టుకు పోతున్నట్లనిపించింది నాకు. కోరి తెచ్చుకున్న దుస్థితి కాదు. కుట్రకు బలైపోతూంది బతుకు! ఇంకా పది నెలలు క్రమం తప్పకుండా ఏభై చొప్పున కట్టాలి! అప్పుడు నా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటే వణుకు పుట్టింది.

'ఏం లాభం లేదంటావా?' అన్నాను. కొన ఊపిరితో.

'నూట ఇరవై రూపాయలు కాదు కదా, వైనలు కూడా ఊరికే పుట్టవు ఈ పట్నంలో. బ్రహ్మానందాలనే అడుగు. వడ్డీ కిస్తారు. చిట్‌లో కూడబెట్ట గలిగితే తీర్చుకోవచ్చు. కాని, నా అనుభవం నేర్పిన పాఠం నీకు ముందే చెబుతాను, విను. నన్నూ, నాకు తెలియకుండా నిన్నూ మడుగుండంలో పడేశారు బ్రహ్మానందాలు. బతికి బయటపడటం కష్టం! ఆకలిని, అవమానాన్ని తృణప్రాయంగా భావించాలి! అలాంటికి తట్టుకోలేక ఆఫీసు పైళ్ళు పేరబడితే మొదటికే మున్సు! బ్రహ్మానందాలతో బంధం తెంపుకునే దాక బతుకొక యజ్ఞం!'

సాన్త్వనం చెప్పాడు పతి. నన్ను హాయిగొట్టి, ప్రాణాన్ని కొల్లగొట్టాలనే దురుద్దేశం వాడికి లేదు. అంత కటువుగా,

కరెక్ట్‌గా రానున్న ప్రమాదాన్ని సూచించాడంటే, నా గుండె బలాన్ని పరీక్షించుకోమని పరోక్షంగా హెచ్చరించినట్లే!

మరురోజు మధ్యాహ్నం బ్రహ్మానందాన్ని [illegible] జేబు మేరకు ఉప్మా కాఫీలతో సత్కరించి, అసలు విషయం గొణిగాను.

'ఎంత?' అన్నాడు పరబ్రహ్మం బిగ్గరగానే.

'మాట ఇవ్వాలి.' బుర్రను తొలిచేస్తున్న సంఖ్య.

'అదేమిటి ఎటూగాకుండా! రౌండ్ ఫిగర్ రెండు వందలు తీసుకోండి.' ఆనందం మంచి ఊత ఇచ్చాడు.

'రెండు వందలకు వడ్డీ నెలకు పన్నెండు రూపాయలు!'

'ఇకనుండి అరవై రెండు పేచేస్తుండాలి మీరు.'

'వెంటబడి అడగటం మా చెడ్డ చిరాకు మాకు. అయిదో తేదీకల్లా అడక్కుండా పర్చుతుండండి.'

ఫైల్ బాగ్ తెరిచి ప్రామిసరీ నోట్ల బుక్ బయటికి తీశాడు పరబ్రహ్మం. మేటరంతా ప్రింటెడ్! స్టాంపులు రెడీగా అతికించి ఉన్నాయి! సంతకం పడేశాను.

ఏభై కట్ చేసుకుని మిగతా ఆనందానికిచ్చాడు పరబ్రహ్మం. మరోసారి జాగ్రత్తగా లెక్కబెట్టి నా చేతి కందించాడు ఆనందం.

స్లో పాయిజనింగ్ వల్ల మనిషి ఒక్కసారి చావలేడు. హింసపడుతూ చావుకు చేరువవుతాడు. చావులోని సుఖమూ కొద్ది కొద్దిగా అనుభవానికొస్తుంది!

పది నెలలు గడిచాయి! పొదుపు చేద్దామనుకున్న ఆరు వందలు ఎడ్జెస్ట్ చెయ్యగా, పైన ఇంకో వెయ్యి అప్పు పడ్డాను. బ్రహ్మానందాలకు నాపట్ల సానుభూతి పెరిగింది. మంచివాడుగా, ప్రాంప్ట్‌నెస్‌కు ప్రతీకగా ఆఫీసు జనంలో నన్ను గూర్చి విశేషంగా ప్రచారం చేశారు. లక్ష్మీపతి ముందు ముఖం చెల్లటం లేదు నాకు. వాడి హెచ్చరికలు, మందలింపులు మట్టిగొట్టుకుపోయాయి. అన్నీనూ, అవమానాల్ని పెంచుకుని ఇదే జీవితంలో నేను సాధించిన ప్రగతి అని ఎవరితో చెప్పుకోగలను? ఒక్క నా గుండెలోనే ఇముడ్చుకుంటే విముక్తి దూరంలో ఉండదనుకున్నాను.

బ్రహ్మానందాలు అట్టే శ్రమపడలేదు రెండోసారి! వంద రూపాయల సిరీస్‌లో చేరితే, సంవత్సరం చివర్లో వెయ్యి అప్పు తీరి లక్షణంగా రెండు వందలు మిగులుతాయని సింపుల్ కాల్క్యులేషన్ చెప్పారు.

మిగిలేదేమిటో ఊహించలేని అనుభవం లేని వాణ్ణి కాదు నేను. మరో దారి లేదు. పరువు మర్యాదలు తాకట్టు పెట్టుకోవటం నా వల్లకాని పని. మొదటి సంవ [illegible] రెండో ఏడు పూర్తిగా అడకత్తెర!

బియ్యం లేని పూట రొట్టెలు. వాటికీ గతిలేకపోతే నూకల జావ. అది కరవైనప్పుడు పిల్లలతో సహా పస్తులు!

చీర చిరుగుల క్రింద నగ్నతను ప్రదర్శించకుండా అతుకుల జాకెట్లు. బ్రతుకు మర్మాన్ని చెప్పే మాసిన లంగాలు. కళ్ళలో జీమూతాలు! భ్రమరాంబను భార్యగా పోల్చుకోలేని నా మగసిరి!

పాంట్ల చివర్లలో నరాల్లా వ్రేలాడపడుతున్న దారపు పోగులు. నా జీవితానికి నిర్వచనంలా కుక్కలు కొరికిన విస్తరి లాంటి షర్ట్ కాలర్లు. కళ్ళలో పిశాచాలు! నా రూపాన్ని భర్తగా గుర్తించలేని భ్రమరాంబ బేలతనం!

ఎండిన బీరతీగెలు పిల్లలు! పలచబడిన నెత్తురు! ఈ ప్రపంచం తమది కాదనుకునే దైన్యం! పరిస్థితులు తెలియని పేచీలు! పొందే పాశవిక శిక్షలు!

నగరంలో నాలుగేళ్ళ తరవాత— వడ్డీ రేటు మారినా, పీడించి పెంచుకున్న అప్పు—జీతానికీ, చెల్లించవలసిన వడ్డీ మొత్తానికీ రాజీ కుదిర్చింది.

నేనూ, భ్రమరాంబా కూడబలుక్కున్నాం! ఇక జీవించే హక్కు లేదని తీర్మానించుకోవటం సులభమే అయింది. నాగరికత విదిలిస్తున్న సరికొత్త సుఖాల్ని వదిలేసిపోతున్నామనే చింత, కన్నబిడ్డల్ని గద్దలకు పారేసి తప్పుకుంటున్నామనే వాత్సల్యం తీరాన్ని దాటటానికి ఆటంక పరచలేదు.

ఆఫీసు, మిత్రులు, బంధువులు, షైలాక్‌లు, చివరకు [illegible] మా స్మృతుల్లోకి రాలేదు.

మహానగరంలో అన్ని రకాల వ్యాపారాలు [illegible] సాగిపోయే పేరు బడిన హోటల్లో— ఆరు చేబదులుతో రిజర్వు చేసుకున్న డబుల్ రూమ్ డన్‌లప్ పిల్లోలమీద, స్వప్నమైన విషాన్ని స్వేచ్ఛ కోసం, సుఖం కోసం ఉదయం వచ్చేకుండా చేతులు మాత్రం పెనవేసి, కడుపునిండా తాగి, కంటినిండా నిద్ర పోయాం నేనూ, నా అర్ధాంగీ!

● ● ●

'కథ చదివాను.'

బలవంతాన కళ్ళు తెరిచాను. దగ్గరగా వచ్చి కూర్చుంది సుజాత. ఎలా ఉందని అడగలేదు నేను.

'కథ చాలా బాగుంది. అంతకన్నా భారంగా ఉంది. భయంతో ఇంకా కొట్టుమిట్టాడుతూంది నా గుండె! ఎందుకలా రాశారు?' అంది సుజాత రుద్ధస్వరంతో, నా గుండెమీద తన చేయి ఉంచి మృదువుగా నిమురుతూ.

'లేనిది రాయలేదు, సుజా! వాస్తవం భయంకరంగా ఉన్నప్పుడు చెడగొట్టకుండా చెప్పటమే న్యాయం' అన్నాను సుజాత చేతిని రాస్తూ.

'మన స్థితి ఇంకా ఘోరంగా ఉంది కదండీ?' భళుక్కున ఏడ్చేసింది సుజాత.

'సుజాతా! అనవసరంగా కంగారు పడకు. నేను రాసింది గోపాలం కథే గాని, అది ఒక్క వాడి కథ మాత్రమే కాదు! మన బోటి కోట్లాది నిర్భాగ్యుల కథ. ఈ కథకు ముగింపు తప్పకుండా ఉంది! ఆ ఆశతో బ్రతకాలి మనం.' సుజాతకు ధైర్యం చెప్పాలని ప్రయత్నించాను. అప్పను, మనో [illegible] ముద్ద కట్టిందేమో! గోపాలం కథ చదివాక హృదయం నొక్కి [illegible] కాలచక్రం దుఃఖాన్ని కుమ్మరించి ఉంటుంది.

'మీరు ... మీ ... రు ... మా ... తం . . .' గొంతులో దుఃఖం అడ్డుపడుతూంది సుజాతకు. ఆమె వేదన నాకు అర్థమైంది.

'చూడు, సుజాతా! నేను పిరికివాణ్ణి కాదు. నిజంగా కాదు. అయినట్లయితే గోపాలమే మన కథ రాసేవాడు' అన్నాను ప్రయత్నం మీద నవ్వి.

'పోనీలెండి! ఈ ప్రైజన్నా వచ్చిందే! కొంతవరకు మన బాధలు తీరతాయి.' కాస్త తెప్పరిల్లింది సుజాత.

'ఆ డబ్బు వాడుకోవటం నా కిష్టం లేదు, సుజా!' మాటల్ని మింగాలనుకున్నా చేతకాలేదు.

'అదేమిటి?' మళ్ళీ అనుమానం.

'ప్రైజ్ వచ్చిన మాట నిజమే! కానీ, కథ గోపాలానిది!'

'కావచ్చు! రచయితలంతా చూసిందో, విన్నదో రాస్తుంటారు. మీలాగ డబ్బు వదులుకుంటున్నారా?'

'కానీ, గోపాలం ముగ్గురు పిల్లలు అనాథ శరణాలయంలో ఉన్నారు, నీకు తెలుసుగా! తండ్రి జీవితం విలువ కన్నబిడ్డలకు చెందాలో, మన స్వార్థానికి వినియోగించుకోవాలో రేపు ఆఫీసులో అడుగుతాను తీర్పు చెప్పండని! ఇక దీన్ని గురించి నన్నేమీ అడగద్దు దయచేసి'. విసుగుపడకుండానే నిక్కచ్చిగా అన్నాను.

సుజాత ఆలోచనలో పడింది! ★

